ప్రమాదమని తెలిసినా..

పైపు మీద పాలానికి..

నిర్మల్ జిల్లా కుంటాల మండలం కల్లూరు, నర్సాపూర్ (జీ) మండలం బూరుగుపల్లి(కే) గ్రామాలను అనుసంధానం చేస్తూ రెండు దశాబ్దాల క్రితం బ్రిడ్జి నిర్మించారు. ఎస్సారెస్పీ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ వంతెన భారీ వరదలతో ఈ ఏడాది మార్చిలో కూలిపోయింది. దీంతో బూరుగుపల్లి గ్రామ రైతులు తమ పొలాలకు వెళ్లడానికి చుట్టూ అదనంగా 14 కిలోమీటర్ల దూరం తిరగాల్సి వస్తున్నది. గత్యంతరంలేక కొందరు రైతులు తెప్పలు తయారు చేసుకుని వాగు దాటుతున్నారు. ఇంకొందరు బ్రిడ్జిపై నుంచి వేసిన మిషన్ భగీరథ ఇనుప పైపులైన్ సాయంతో దాటుతున్నారు. ప్రమాదమని తెలిసినా.. వ్యవసాయ పనులకు వెళ్లడం తప్పనిసరి కావడంతో ప్రాణాలకు తెగించి వాగు దాటుతున్నారు. –కుంటాల

మెడికోకు గుండు కొట్టించారు!

మొదటిపేజీ తరువాయి...

ఘటన సంచలనంగా మారింది. యాంటీ ర్యాగింగ్ మెడికల్ ఆఫీసర్ అయిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రెహమాన్ నిర్వాకం కాలేజీ ప్రతిష్ఠకే మచ్చ తెచ్చిపెట్టింది. ములుగుకు చెందిన వివేక్ కేజీఎంసీలో అడ్మిషన్ పొందాడు. తరగతులు ప్రారంభంకావడంతో తనకు నచ్చిన కటింగ్ చేయించుకొని వచ్చాడు. కాలేజీలో సెకండియర్ విద్యార్థులు కొందరు అతడిని పిలిచి కటింగ్ సరిచేసుకోవాలని ఆదేశించారు. సీనియర్ల ఆదేశానుసారం అతడు మళ్లీ కటింగ్ సరిచేసుకుని వచ్చాడు. కానీ సంతృప్తి చెందని యాంటీ ర్యాగింగ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రెహమాన్.. ఎంబీబీఎస్ స్టూడెంట్‌ను సెలూన్ షాపునకు స్వయంగా తీసుకెళ్లి ఏకంగా గుండు కొట్టించాడు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇదే విషయంపై ఇద్దరినీ పిలిపించిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు విచారించారు. విద్యార్థికి గుండు కొట్టించిన విషయం వాస్తవమేనని అసిస్టెంట్ ప్రొఫెసర్ అంగీకరించారు. దీంతో ఆయనను హాస్టల్ బాధ్యతల నుంచి తప్పించారు. ఇదే సమయంలో ఫస్టియర్ విద్యార్థిని ర్యాగింగ్ పేరుతో సీనియర్లు వేధించి గుండు కొట్టించారన్న ఆరోపణలు బయటికి పొక్కడంతో విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి. పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ సహా మరికొన్ని సంఘాల నేతలు కేజీఎంసీ ఎదుట ఆదివారం ఆందోళనకు దిగారు. ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్ విద్యార్థులతోపాటు గుండు కొట్టించిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై చర్యలు తీసుకోవాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కేజీఎంసీ విద్యార్థికి గుండు కొట్టించిన ఘటనపై ఖమ్మం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. విద్యార్థి కొర్రా వివేక్‌రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్టు సీఐ ఉదయ్‌కుమార్ మీడియాకు తెలిపారు.

నల్లగొండలో వైద్య విద్యార్థుల సస్పెన్షన్

నల్లగొండ మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్థినులపై ర్యాగింగ్‌కు పాల్పడిన ముగ్గురు వైద్య విద్యార్థులు, ఒక జూనియర్ డాక్టర్‌ను అధికారులు శనివారం సస్పెండ్ చేసినట్టు తెలిసింది. బాధ్యులైన సెకండియర్ విద్యార్థికి ఒక నెల, ఇద్దరు ఫైనలియర్ విద్యార్థులను ఆరు నెలలు, జూనియర్ డాక్టర్‌ను మూడు నెలలపాటు సస్పెండ్ చేసినట్టు కాలేజీ వర్గాలు పేర్కొన్నాయి. ఇదే నెల మొదటివారంలో మహబూబ్‌నగర్ మెడికల్ కాలేజీలో జూనియర్ విద్యార్థులను సెకండియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడటంతో 10 మందిని సస్పెండ్ చేశారు. నెల రోజులపాటు తరగతులకు హాజరుకాకుండా వారిపై నిషేధం విధించారు. ఇంత జరుగుతున్నా వైద్యారోగ్య శాఖ కార్యదర్శి కానీ, డీఎంఈ గానీ, కాళోజీ హెల్త్ వర్సిటీ వీసీగానీ ఈ అంశంపై దృష్టిపెట్టలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆలస్యంగా స్పందించిన మంత్రి

రెండు వారాలుగా వరుస ర్యాగింగ్ ఘటనలు వెలుగుచూస్తున్నా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించనేలేదు. తాజాగా మూడు కాలేజీల్లో ర్యాగింగ్ ఘటనలు బయటకొచ్చి, పరువు పోయిన తర్వాత మేల్కొన్నారు. ఆదివారం ఆయన వైద్యశాఖ ఉన్నతాధికారులతో ర్యాగింగ్ ఘటనలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం ఘటనపై ఆగ్రహం వ్యక్తంచేశారు. విచారణ జరిపి, బాధ్యులను శిక్షించాలని ఆదేశించారు.

సగం పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాల్లేవ్..?

- యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సగం పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు లేవని పోలీసు శాఖ ఇచ్చిన వివరణలో తేలిందని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సీసీలు ఉండాలని సుప్రీం కోర్టు తెలిపిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్ని పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఉన్నాయో తెలుసుకునేందుకు తాము ఆర్టీఐ ద్వారా సమాధానం కోరినట్టు చెప్పారు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు రాష్ట్రంలోని 376 పోలీస్ స్టేషన్లలో మాత్రమే సీసీ కెమెరాలు ఉన్నాయని, 396 పోలీస్ స్టేషన్లలో సీసీ కెమెరాలు లేవని తేలిందని వెల్లడించారు.

కాల్చిన బీడే అంటుకున్నది!

- నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

మానకొండూర్ రూరల్, నవంబర్ 17 : మంచానికి పరిమితమైన వృద్ధురాలిని ఆమె కాల్చిన బీడే దహించివేసింది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం శ్రీనివాస్‌నగర్‌లో బొడ్డు పోచమ్మ (90),ఎల్లవ్వ అనే అత్తా కోడళ్లు ఉంటున్నారు. ఆదివారం కోడలు పనికి వెళ్లగా, పోచమ్మ బీడీ తాగి పడుకుంది. బీడీ మంచంలోనే పడి మంటలంటుకున్నాయి. కాలు విరిగి లేవలేని స్థితిలో ఉన్న పోచమ్మ అరుపులతో చుట్టుపక్కల వారు కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్‌కు తరలిస్తుండగానే పోచమ్మ మృతి చెందింది

గ్రూప్-3లో జేఈఈ మెయిన్స్‌పై ప్రశ్న

- హరితహారం, కల్యాణలక్ష్మి, ఆరోగ్య లక్ష్మి పథకాలపైనా..
- తెలంగాణ తల్లి విగ్రహంపైనా ప్రశ్న
- ఆలస్యంగా వచ్చిన వారికి నో ఎంట్రీ

సికింద్రాబాద్‌లో అభ్యర్థులను తనిఖీ చేసి పరీక్షాకేంద్రానికి అనుమతిస్తున్న పోలీసులు

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-3 పరీక్షల్లో ఐఐటీ, జేఈఈ మెయిన్స్‌పై ప్రశ్నవచ్చింది. 'విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో ఐఐటీల్లో కోర్సులకు చాలా డిమాండ్ ఉంది'. 'ఐఐటీల్లో 17వేల సీట్లున్నాయి. జేఈఈ మెయిన్స్‌కు ఏటా 12లక్షల మంది దరఖాస్తు చేసుకుంటున్నారు' అంటూ రెండు ప్రవచనాలిచ్చారు. వీటిలో సరైనది ఏదీ.. రెండు సరైనవే అంటూ ఆప్షన్లు ఇచ్చారు. ఇక కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్ఠాత్మక పథకాలపైనా గ్రూప్-3లో ప్రశ్నలిచ్చారు. హరితహారం, కల్యాణలక్ష్మి, ఆరోగ్యలక్ష్మి పథకాలు ఇచ్చి ఆయా పథకాల లక్ష్యం, ఉద్దేశాలను జతపరచమని ప్రశ్నలిచ్చారు. తెలంగాణ తల్లిపైనా ఒక ప్రశ్నను అడిగారు. సినిమాలపై రెండు ప్రశ్నలొచ్చాయి. 7వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో 2022 సంవత్సరానికి ఉత్తమ డాక్యుమెంటరీ, ఆస్కార్ అవార్డుకు నామినేట్‌అయిన 'టు కిల్ ఏ టైగర్' డాక్యుమెంటరీ దర్శకుడు ఎవరు..? అంటూ ప్రశ్నలిచ్చారు.

సగం మందే హాజరు

గ్రూప్-3 పరీక్షను ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించగా, కలెక్టర్లు, పోలీసులు పరీక్షాకేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. గ్రూప్ 3 పరీక్షకు సగం మంది మాత్రమే హాజరైయినట్టు టీజీపీఎస్సీ సెక్రటరీ నవీన్ నికోలస్ తెలిపారు. ఉదయం పేపర్1 పరీక్షకు 51.1 శాతం, మధ్యాహ్నం పేపర్ 2 పరీక్షకు 50.7శాతం మాత్రమే హాజరయ్యారని చెప్పారు.

ప్రధాన రోడ్లకు దూరంగా.. సెంటర్లు

పరీక్ష సందర్భంగా అరగంట ముందుగానే గేట్లు మూసివేశారు. ఉదయం సెషన్‌లో 9:30కు, మధ్యాహ్నం సెషన్‌లో 2:30గంటలకే గేట్లకు తాళం వేశారు. దీంతో ఆలస్యంగా వచ్చిన పలువురు అభ్యర్థులు పరీక్షరాయకుండా వెనుదిరగాల్సి వచ్చింది. సికింద్రాబాద్‌లో ఇద్దరు, బేగంపేట మహిళా డిగ్రీ కాలేజీ సెంటర్‌లో ఐదుగురు ఆలస్యంగా రాగా పరీక్షకు అనుమతించలేదు. ఆలస్యంగా వచ్చినందుకు అనుమతించకపోవడంతో పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సెంటర్ ఎదుట ఓ అభ్యర్థి హాల్‌టికెట్‌ను చింపేసి వెనుదిరిగాడు. పెద్దపల్లి జిల్లాలో ఇద్దరు అభ్యర్థులు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. అయితే సెంటర్లను ప్రధాన రోడ్లకు దూరంగా, గల్లీల్లోని విద్యాసంస్థల్లో పరీక్షాకేంద్రాల్లో వేశారు. ఆయా సెంటర్ల వద్దకు చేరుకోవడానికి అభ్యర్థులు తిప్పలు పడ్డారు. దీంతో పాటు పలు చోట్ల రోడ్ల మరమ్మతులు చేస్తుండటం, ట్రాఫిక్ మళ్లింపులతో సెంటర్లకు చేరుకునేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది.

నేడు మూడో పేపర్

గ్రూప్-3 పరీక్షల్లో భాగంగా సోమవారం మూడో పేపర్‌కు పరీక్షను నిర్వహిస్తారు. మూడో పేపర్ అయిన ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్‌కు పరీక్ష నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. ఆదివారం తీసుకెళ్లిన హాల్‌టికెట్‌తోనే అభ్యర్థులు పరీక్షకు హాజరుకావాలి. కొత్త హాల్‌టికెట్‌ను తీసుకెళితే పరీక్షకు అనుమతించరు.



భువనేశ్వర్‌లో జర్నలిస్టు ఇస్లాముద్దీన్‌ను సత్కరిస్తున్న ఒడిశా గవర్నర్ రఘుబర్‌దాస్

హైదరాబాద్ జర్నలిస్టుకు ఒడిశా ప్రభుత్వ అవార్డు

హైదరాబాద్, నవంబర్17(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు చెందిన సీనియర్ జర్నలిస్టు షేక్‌ఇస్లాముద్దీన్ (మరో కురుక్షేత్రం న్యూస్)ను ఒడిశా రాష్ట్రం సత్కరించింది. నేషనల్ ప్రెస్‌డేను పురస్కరించుకుని శనివారం రాత్రి ఒడిశాలోని భువనేశ్వర్‌లో నేషనల్ జర్నలిస్ట్ వెల్ఫేర్ బోర్డు, దూరదర్శన్, ఎఐఆర్, రీజినల్ ఔట్‌రీచ్ బోర్డ్ ఫీల్డ్ ఔట్‌రీచ్ బోర్డ్ అకాడమీ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఒడిశా గవర్నర్ రఘుబర్‌దాస్, మంత్రి సురేశ్ పూజారి అవార్డులు అందజేసి సత్కరించారు.

బస్సు కోసం రోడ్డెక్కిన మహిళలు

జగిత్యాల నుంచి కడెం వరకు వెళ్లే బస్సులను తమ గ్రామం మీదుగా నడపాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం భూత్కూర్‌కు చెందిన మహిళలు ఆదివారం మున్యాల-భూత్కూర్ చౌరస్తా వద్ద ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. – దస్తురాబాద్

నేడు మండల సమాఖ్యల ప్రత్యేక సమావేశం

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలోని అన్ని మండలకేంద్రాల్లో సోమవారం మండల సమాఖ్యల ప్రత్యేక సమావేశం నిర్వహించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో సంఘాల్లో కొత్త సభ్యులను చేర్పించడం, రుణ బీమా, ప్రమాద బీమా, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఏర్పాటు,డ్వాక్రా బజార్లు, బ్యాంకు రుణాలు, మహిళాశక్తి భవనాల నిర్మాణం తదితర అంశాలపై చర్చించనున్నారు.

అటకెక్కిన 'వర్కర్ టు ఓనర్' పథకం

- ఆదాయ మార్గాల కోసం కాంగ్రెస్ సర్కారు వెంపర్లాట
- సిరిసిల్లలో కార్మికులకు కేటాయించాల్సిన వర్క్‌షెడ్లను ఇతరులకు కేటాయించేందుకు ప్రయత్నాలు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న పవర్‌లూమ్ కార్మికులు

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మరమగ్గాల కార్మికులకు చేయూతనివ్వాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వారిపై కత్తులు దూస్తున్నది. పవర్‌లూమ్ కార్మికులను ఆదుకునేందుకు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని అటకెక్కించింది. ఈ పథకం కింద సిరిసిల్లలో పవర్‌లూమ్ కార్మికుల కోసం నిర్మించిన వర్క్‌షెడ్లను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆదాయ మార్గాలుగా మలుచుకుంటున్నది. ఆ షెడ్లను ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు అద్దెకు ఇచ్చి ఆదాయాన్ని రాబట్టుకోవాలని చూస్తున్నది. దీనిపై పవర్‌లూమ్ కార్మికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కోసం నిర్మించిన వర్క్‌షెడ్లను ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు ఎలా కట్టబెడతారని నిలదీస్తున్నారు. ఆర్థికంగా చితికిపోయిన పవర్‌లూమ్ కార్మికులను ఆదుకోవాలని గతంలో సీఎం కేసీఆర్ భావించారు. అందుకోసం 'వర్కర్ టు ఓనర్' అనే సరికొత్త పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆ పథకం కింద అత్యాధునిక హంగులతో వర్క్‌షెడ్లను నిర్మించాలని సంకల్పించారు. అనుకున్నదే తడవుగా సిరిసిల్లలో 88.03 ఎకరాల భూమితోపాటు రూ.220 కోట్లు కేటాయించారు. ఆ నిధులతో 46 వర్క్ షెడ్లు, 4 వార్పిన్ షెడ్లు నిర్మించారు. వాటిలో దాదాపు 4,416 పవర్‌లూమ్‌ను ఏర్పాటు చేసే అవకాశం కల్పించారు. వాటిని 50% సబ్సిడీతో ఒక్కో కార్మికునికి 4 చొప్పున 1,104 మంది కార్మికులకు కేటాయించాలని నిర్ణయించారు. అందుకోసం లబ్ధిదారులను ఎంపిక చేయాల్సిన తరుణంలో అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన పవర్‌లూమ్ కార్మికులను ఏమాత్రం పట్టించుకోకపోగా వారి బతుకులతో చెలగాటమాడుతున్నారు.

బతుకమ్మ చీరలు రద్దు

సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రేవంత్‌రెడ్డి బతుకమ్మ చీరల పథకాన్ని రద్దు చేసి, పవర్‌లూమ్ కార్మికుల పొట్టలు కొట్టారు. వారికి జీవనోపాధి లేకుండా చేసి, మళ్లీ ఆర్థిక సమస్యల్లోకి నెట్టేశారు. పనోళ్లు పనోళ్లలా, యజమానులు యజమానుల్లాగే ఉండాలన్న సంకుచిత బుద్ధితో 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని నీరుగార్చారు. ఆ పథకం కింద కార్మికుల కోసం నిర్మించిన వర్క్‌షెడ్లను గోదాములు, కోల్డ్ స్టోరేజీల్లా ఉపయోగించుకునేలా వ్యాపార సంస్థలకు కేటాయించాలని యోచిస్తున్నారు. ఇప్పటికే ఒక షెడ్డును విద్యుత్తు సంస్థ ఆధ్వర్యంలోని 'సెస్'కు కేటాయించారు. మిగిలిన షెడ్లను కూడా అద్దె ప్రాతిపదిన ప్రైవేటు సంస్థలకు, వ్యక్తులకు కేటాయించి, దాదాపు 30 వేల మంది కార్మికుల కడుపు కొట్టాలని చూస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టేందుకు కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి.

రామా చంద్రమౌళికి జీవన సాఫల్య పురస్కారం

రచయిత ప్రొఫెసర్ రామా చంద్రమౌళి

పోచమ్మమైదాన్ (వరంగల్), నవంబర్ 17: ఓరుగల్లుకు చెందిన ప్రముఖ కవి, రచయిత, ప్రొఫెసర్ రామా చంద్రమౌళికి జీవన సాఫల్య పురస్కారం దక్కింది. ఈ నెల 22, 23న దోహా (ఖతార్)లో జరుగనున్న 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.

బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి

హైదరాబాద్, నవంబర్ 17 (నమస్తేతెలంగాణ) : నైరుతి బంగాళాఖాతంలో ప్రస్తుతం ఉపరితల ద్రోణి ప్రభావంతో ఏపీలో వర్షాలు కురుస్తాయని, తెలంగాణలో పొడి వాతావరణం ఉంటుందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. 22వ తేదీ వరకు పొడి వాతావరణమే ఉంటుందన్నారు. హైదరాబాద్ శివారు ప్రాంతంలో 18 డిగ్రీలకు దిగువన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

ఆర్ఐపై ఇసుక మాఫియా దాడి

బూర్గంపహాడ్ మండలంలో ఘటన

ఇసుక మాఫియా వినియోగించిన కర్రలను చూపిస్తున్న అధికారులు

బూర్గంపహాడ్, నవంబర్ 17: రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై ఇసుక మాఫియా ముఠా దాడి చేసింది. ఈ ఘటన భద్రాద్రి జిల్లాలో చోటుచేసుకున్నది. రెవెన్యూ అధికారుల కథనం ప్రకారం.. బూర్గంపహాడ్ మండలంలోని సారపాకలో బ్రిడ్జి కింద శనివారం అర్ధరాత్రి సమయంలో ఇసుక రవాణా జరుగుతుందన్న సమాచారం రెవెన్యూ అధికారులకు అందింది. వారు పోలీసులకు కూడా సమాచారం ఇచ్చారు. అనంతరం తహసీల్దార్ ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ రాంనరేశ్, ఆర్ఐ-1 ముత్తయ్య, రెవెన్యూ సిబ్బంది కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. భాస్కర్‌నగర్, గాంధీనగర్‌కు చెందిన ఇసుక మాఫియా ముఠా సభ్యులు అప్పటికే అక్కడ ఉన్నారు. రెవెన్యూ అధికారులు రాగానే ముఠా సభ్యులు కర్రలతో ఆర్ఐపై దాడికి యత్నించారు. వారిని పట్టుకుంటున్న క్రమంలో ఆర్ఐ కాళ్లను లాగారు. కింద పడటంతో ఆయన కాలికి గాయమైంది. వెంటనే మిగతా అధికారులు అక్కడే ఉన్న ఓ వ్యక్తిని పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఓ ట్రాక్టర్ సహా దాడికి ఉపయోగించిన కర్రలను, ఇసుక రవాణాకు ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగుండె

- ఎకరాకు ఏడాదికి 10 వేలిచ్చిండు
- గిప్పుడు గవ్వేవీ లేకుంటైనయ్
- కనీసం వడ్లు కొనేటోళ్లు లేరు
- బీజేపీ నేత ఎదుట పడ్తనపల్లి రైతుల ఆవేదన
- కాంగ్రెస్‌పై ఆగ్రహం.. కేసీఆర్‌పై పొగడ్తల వర్షం

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పడ్తనపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో బీజేపీ నేత ఎదుటే కేసీఆర్‌ను పొగుడుతున్న రైతులు

మంచిర్యాల, నవంబర్ 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగుండె. గాయన ఎకరాకు ఏడాదికి రూ.10 వేలు రైతుబంధు ఇచ్చిండు. గా డబ్బులతోని మందు బస్తాలు కొనుక్కునేటోళ్లం. కూలీల ఖర్చులకు అక్కరకు వచ్చేవి. కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటి నుంచి ఏం లేకుండా పోయినయి. గిప్పటి వరకు రైతుబంధు (రైతు భరోసా) ఇయ్యలె. మేం కొనుగోలు కేంద్రానికి వచ్చి పది రోజులైతంది. కనీసం వడ్లు కొనేటోళ్లు లేరు. తాలు పేరుతో ఇబ్బందులు పెడుతున్నరు. ఇక్కడ సుతీల్ లేదు, పరదలు లేవు. అన్నీ రైతులే భరించుడైతంది. పరదలు మేమే తెచ్చుకోవాలి. సుతీల్ మేమే తెచ్చుకోవాలి. హమాలీలకు పైసలు మేమే ఇచ్చుకోవాలి. మళ్లా ఈ సంవత్సరం గా సుతీల్‌ను రంగులో ముంచి ఇయ్యాలంటున్నరు. మరి వాళ్లు ఏ రంగు పెడ్తరో మాకు తెల్వదు. సుతీల్ తేపో అనంగనే మేము కొనుక్కొని వచ్చుడైతంది. రంగులో ముంచుడెప్పుడు.. ఇగ వాళ్లు జోకుడెప్పుడు. ప్రతి కల్లం దగ్గర రైతుల పరిస్థితి గిదే. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు మాకు ఏర్పాడలే. కాంగ్రెస్ వస్తే ఏమో చేస్తది అనుకున్నం. కానీ ఇట్లున్నది కాంగ్రెస్ పని తీరు' అంటూ రైతులు మంచిర్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ సాక్షిగా కాంగ్రెస్‌పై కోపాన్ని వ్యక్తం చేస్తూనే కేసీఆర్‌పై ప్రేమను చాటుకున్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం పడ్తన్‌పల్లి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వెరబెల్లి రఘునాథ్ సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ధాన్యం అమ్మకానికి తెచ్చి పది రోజులవుతున్నా ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు చేయలేదని వాపోయారు. తాలు పేరిట ధాన్యంలో కోతలు పెడుతూ తమ కష్టాన్ని దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ నేత వెరబెల్లి రఘునాథ్ రైతులతో మాట్లాడుతూ.. కేసీఆర్ రైతుబంధు ఇచ్చారు అనగానే.. ఇప్పుడు అది కూడా లేకుండా పోయిందంటూ రైతులకు చెప్పుకొచ్చారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని, అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొన్న ధాన్యం.. లెక్కలు గోప్యం!

మొదటిపేజీ తరువాయి...

అధికారికంగా ధాన్యం కొనుగోళ్ల వివరాలను వెల్లడించకపోవడం గమనార్హం.

తోటి శాఖలకూ నో ఇన్ఫర్మేషన్...

ధాన్యం సేకరణలో సివిల్ సప్లైతో పాటు మార్కెటింగ్, వ్యవసాయ శాఖతో పాటు ఇతర శాఖలు కూడా భాగస్వామ్యమవుతున్నాయి. ఇందులో భాగంగానే రోజువారీగా ధాన్యం కొనుగోళ్ల వివరాలను సుమారు 10-15 శాఖలకు సివిల్ సప్లై పంపిస్తుంది. ఇది గత సీజన్ వరకు అనవాయితీగా ఉండేది. ప్రతిరోజు కొనుగోళ్ల వివరాలను మెయిల్ ద్వారా ఈ శాఖలకు పంపించేవారు. కానీ ఈ సీజన్ నుంచి ఈ విధానానికి స్వస్తి పలికారు. కనీసం ఆ శాఖల నుంచి అధికారులు అడిగినా సివిల్‌సప్లై అధికారులు స్పందించడంలేదని తెలిసింది. దీంతో ఇతర శాఖల అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. 'గతంలో రోజువారీగా ధాన్యం కొనుగోళ్ల వివరాలు వచ్చేవి. ఇప్పుడు పంపించడం లేదు ఎందుకని అడిగితే స్పందించడం లేదు. ఎన్నిమార్లు అడిగినా వివరాలు మాత్రం ఇవ్వడం లేదు. దీంతో మేమే మా క్షేత్రస్థాయి అధికారుల నుంచి వివరాలు సేకరించుకుంటున్నాం' అని ఓ శాఖ అధికారి తన ఆవేదన వ్యక్తం చేయడం గమనార్హం.

డొల్లతనం బయటపడుతుందనేనా...?

బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోళ్ల వివరాలు వెల్లడించేవారు. ఓసారి మంత్రి, మరోసారి కమిషనర్ లేదంటే చైర్మన్ ఇలా ఎవరో ఒకరు ఏకంగా విలేకరుల సమావేశం నిర్వహించి మరీ ప్రజలకు వివరాలకు తెలియజేసేవారు. కానీ

ఇప్పుడు పూర్తి విరుద్ధంగా కొనుగోళ్ల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతున్నారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలను రహస్యంగా ఉంచాల్సిన అవసరం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గతంలో ఎప్పుడూలేని విధంగా ఈ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. మిల్లర్లతో ఇబ్బందులు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, చేసిన చోట నెమ్మదిగా కొనుగోళ్లు చేయడం వంటి ఇబ్బందులున్నాయి. దీంతో ఎక్కడికక్కడ రైతులు ఆందోళనలు చేస్తున్నారు. ఈ సీజన్‌లో కోటి టన్నుల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 10 లక్షల టన్నులు కూడా కొనుగోలు చేయలేదని తెలిసింది. ఈ నేపథ్యంలో కొనుగోళ్ల వివరాలు బయటకు పొక్కితే ప్రభుత్వం ఇబ్బందుల్లో పడే అవకాశం ఉంది. డొల్లతనం బయటపడకుండా ఉండేందుకే వివరాలను గోప్యంగా ఉంచుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

DIWALI BLOCKBUSTER 3వ వారం
DULQUER SALMAAN
లక్కీ భాస్కర్
VENKY ATLURI
NAGA VAMSI.S - SAI SOUJANYA
A G V PRAKASH KUMAR MUSICAL
NIMISH RAVI NAVIN NOOLI BANGLAN
TELUGU · MALAYALAM · TAMIL · HINDI · KANNADA
దేశి
70 ఎంఎం ఎ/సి - ఆర్‌టీసి క్రాస్ రోడ్స్ 11.00,2.30,6.00,9.15
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
విశ్వనాథ్ - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45
శ్రీరాములు - మూసాపేట్ 6.30,9.30
ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.00,6.00
రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 6.00,9.00
ఏషియన్ లక్ష్మీకళ - మూసాపేట్ 11.25,2.40,9.45
వెంకటరమణపద్మావతి - కాచిగూడ 9.30PM
Nanak ప్రసాద్ - మీర్‌పేట్‌గుట్ట 10.25,2.25,5.10,8.30
PVR ఎల్.జి - బంజారాహిల్స్ 1.05,11.10PM
PVR పంజగుట్టమాల్ - పంజాగుట్ట 1.30,7.40,11.10
PVR మహేశ్‌బాబుమాల్ - మార